పాఠశాల విద్యా వ్యవస్థ అస్తవ్యస్తం

- కనుమరుగవుతున్న అప్పర్ ప్రైమరీ స్కూల్స్
- పాఠశాలలకు దూరమవుతున్న విద్యార్థులు
- కనీస ప్రమాణాలు లేని నూతన హైస్కూల్స్
- ఈ ఏడాది భారీగా తగ్గిన హాజరు శాతం



కొండపల్లి అడవి క్వారీలో క్వారీ కార్మికుల పిల్లల కోసం గతంలో ఏర్పాటు చేసిన అప్పర్ ప్రైమరీ పాఠశాల



పశ్చిమ ఇబ్రహీంపట్నంలో కనీస సదుపాయాలు, క్రీడా ప్రాంగణం లేకుండా ఏర్పాటు చేసిన హైస్కూల్

ఇబ్రహీంపట్నం: కూటమి ప్రభుత్వంలో నూతన విద్యా వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. నూతన విద్యా విధానం వివిధ గ్రామాల్లో ఒకటి నుంచి ఎనిమిదో తరగతి వరకు ఉన్న అప్పర్ ప్రైమరీ పాఠశాలలను కనుమరుగు చేసింది. వాటిని ఐదో తరగతి వరకే పరిమితం చేసింది. దీంతో 6,7,8 తరగతుల విద్యార్థులు దూరంగా ఉన్న హైస్కూళ్లకు వెళ్లలేక చదువులకు స్వస్తి చెప్పే పరిస్థితులు నెలకొన్నాయి. కొండపల్లి అడవి క్వారీ పాఠశాలలో క్వారీ కార్మికుల పిల్లలు 34 మంది ఉండగా, పాఠశాలను మోడల్ పాఠశాలగా ఐదో తరగతికి పరిమితం చేశారు. 6,7,8 తరగతుల విద్యార్థులు కనీసం రవాణా సౌకర్యంలేని ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్న కొండపల్లి వెళ్లి చదివేందుకు ఇష్టపడటం లేదు. కొన్ని అప్పర్ ప్రైమరీ పాఠశాలలు హైస్కూల్‌గా మార్చడంతో ఇరుకు గదుల్లో చదువుతూ, ఆడుకునేందుకు ఆటస్థలం లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. మండలంలో 38 ప్రభుత్వ పాఠశాలల్లో గత ఏడాది సుమారు 5,600 మంది విద్యార్థులు చదవగా, ఈ ఏడాది 4,760 మందికి పరిమితమయ్యారు. కొండపల్లి శాంతినగర్‌లో ఆరుగురు, కొండపల్లి పీఎస్‌లో నలుగురు, కొండపల్లి ఏబీఎంపేట స్కూల్‌లో ఏడుగురు విద్యార్థులు చదవడం గమనార్హం.

కనుమరుగైన అప్పర్ ప్రైమరీ స్కూల్స్

కూటమి ప్రభుత్వం ఒకటి నుంచి ఎనిమిదో తరగతి వరకు వివిధ గ్రామాల్లో ఉన్న అప్పర్ ప్రైమరీ పాఠశాలలను కనుమరుగు చేసింది. యూపీ స్కూల్ కనుమరుగు కావడంతో ఐదో తరగతి పూర్తి చేసిన విద్యార్థులు పొరుగు గ్రామాల్లో కిలో మీటర్ల దూరాన ఉన్న పాఠశాలలకు వెళ్లే పరిస్థితులు తెచ్చారు. కొందరు విద్యార్థులు పొరుగు గ్రామాలకు వెళ్లేందుకు ఇష్టపడటం లేదు. కొండపల్లిలో క్వారీ కార్మికుల పిల్లల కోసం అడవి ప్రాంతంలో ఏర్పాటు చేసిన అప్పర్ ప్రైమరీ పాఠశాలను ప్రస్తుతం మోడల్ పాఠశాలగా మార్పు చేసి ఐదో తరగతికి పరిమితం చేశారు. ఇక్కడ 34 మంది కార్మికుల పిల్లలకు గాను మారిన విధానంతో 24 మంది మాత్రమే మిగిలారు. మిగిలిన 10 మంది ఐదు కిలోమీటర్ల దూరం ఉన్న కొండపల్లి పాఠశాలకు వెళ్లేందుకు రవాణా సదుపాయంలేక చదువులు మానే పరిస్థితి నెలకొంది.

గత ప్రభుత్వంలో పాఠశాలలకు స్వర్ణయుగం

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ప్రభుత్వ పాఠశాలలకు స్వర్ణయుగం. పట్టణాలు, పల్లెల్లో సైతం నాడు–నేడు పథకం ద్వారా పాఠశాలల రూపురేఖలు మార్చారు. డిజిటల్ విద్యకు ప్రాధాన్యం ఇచ్చారు. అందుకు అవసరమైన స్క్రీన్‌లు, ఎనిమిదో తరగతి నుంచి ట్యాబ్‌లు పంపిణీ చేశారు. ధనవంతుల పిల్లలకు అందుబాటులో ఉండే ఐబీ సిలబస్ ప్రభుత్వ బడుల్లో ప్రవేశ పెట్టారు. అమ్మ ఒడి, జగనన్న విద్యా కానుక, జగనన్న గోరుముద్ద, నాడు– నేడు వంటి అనేక కార్యక్రమాలు ప్రవేశపెట్టి తల్లిదండ్రులకు భరోసా కల్పించారు. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రభుత్వ పాఠశాలల్లో ఒకటో తరగతిలో చేరేందుకు ఇష్టం చూపడంలేదు. ప్రభుత్వ పాఠశాలల్లో కనీస సదుపాయాలు నెలకొల్పాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

మౌలిక సదుపాయాలు లేని నూతన హైస్కూల్స్

వెస్ట్ ఇబ్రహీంపట్నం, కొత్త చిలుకూరు, కొటికలపూడి గ్రామాల ఎంపీయూపీ పాఠశాలలను హైస్కూల్స్‌గా మార్పు చేశారు. వీటిలో ప్రస్తుతం తరగతి గదులు అందుబాటులో ఉన్నప్పటికి భవిష్యత్‌లో అదనపు తరగతి గదులు, క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేసేందుకు స్థలం కొరత ఏర్పడనుంది. మూలపాడు, గుంటుపల్లి, కొండపల్లి, ఇబ్రహీంపట్నం జెడ్పీ పాఠశాలలు సుమారు 4 నుంచి 5 ఎకరాల్లో విస్తరించి ఉన్నాయి. గదులతో పాటు క్రీడా ప్రాంగణం కలిగి ఉన్నాయి. ప్రస్తుత నూతన హైస్కూల్స్ కేవలం అర ఎకరం లోపు విస్తీర్ణంలో ఉన్నాయి. హైస్కూల్స్ ప్రమాణాల మేరకు విస్తరణ జరిగితే స్థలం కొరతతో భవిష్యత్ ఆగమ్యగోచరంగా మారనుంది. మా బిడ్డ సొంత ఊరిలోనే చదువుకుంటున్నారనే ఆనందం ఉన్నా సదుపాయాలు లేని పాఠశాలల్లో చదువు, క్రీడలు, ఇతర శిక్షణలపై తల్లిదండ్రులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

అడవి క్వారీలో అప్పర్ ప్రైమరీ కొనసాగించాలి



నా ముగ్గురు పిల్లలు అడవి క్వారీ యూపీ పాఠశాలలో ఇప్పటి వరకు చదివారు. 6,7,8 తరగతులు తీసేశారు. ఇద్దరు ఆడపిల్లలను ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్న కొండపల్లికి పంపుతున్నా. ఆటో సౌకర్యం కూడా లేదు. పిల్లలను నా భర్త తీసుకెళ్లి, తీసుకొస్తున్నాడు. ప్రతి రోజూ స్కూల్ పేరుతో ప్రైవేట్ కంపెనీ వారు పర్మిషన్ ఇవ్వడం లేదు. ఉద్యోగం తీసేస్తామంటున్నారు. ఏమి చేయాలో దిక్కుతోచడం లేదు. అడవి క్వారీ స్కూల్ అప్పర్ ప్రైమరీ పాఠశాలగా కొనసాగించి నూతన హైస్కూల్స్‌లో మౌలిక సదుపాయాలు కల్పించాలి.

– నిర్మల, పేరెంట్, అడవి క్వారీ, కొండపల్లి

క్లుప్తంగా

జెడ్పీ చైర్‌పర్సన్ హారికకు పరామర్శ



విజయవాడరూరల్: జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారికను వైఎస్సార్ సీపీ విజయవాడ రూరల్ మండల నాయకులు గురువారం పరామర్శించారు. గుడివాడలో ఆమెపై జరిగిన దాడి రాష్ట్రంలో ప్రభుత్వ పాలనకు అద్దం పడుతోందని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు బయ్యారపు రవి కిశోర్ అన్నారు. జిల్లా ప్రథమ పౌరురాలిపై టీడీపీ గూండాలు చేసిన దాడిని రాష్ట్రంలో ప్రతి ఆడబిడ్డపై జరిగిన దాడిగా భావిస్తున్నామన్నారు. కార్యక్రమంలో పైడూరుపాడు సర్పంచి వేముల సీతారామయ్య, నాయకులు రంగినేని చిట్టిబాబు, డొక్కా వెంకటరత్నం, వేముల సతీష్ తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదులకు సన్మానం

మైలవరం: అంతర్జాతీయ న్యాయవాదుల దినోత్సవం లయన్స్ క్లబ్ ఆఫ్ మైలవరం ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఏజీపీ ఏడీ ప్రసాద్, వీటీ కిశోర్, పి. దినేష్, సీనియర్ న్యాయవాది బుద్దవరపు వెంకటరావు, తనూజలను లయన్స్ క్లబ్ ఆఫ్ మైలవరం సభ్యులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ జాస్తి వెంకటేశ్వరరావు, లయన్స్ క్లబ్ ఆఫ్ మైలవరం పీఎస్టీలు చనుమోలు నాగభూషణం, శీలం రామిరెడ్డి, చలువాది హరీష్ కుమార్ గుప్తా, లయన్ సభ్యులు పాల్గొన్నారు.

నీటి సమస్య పరిష్కారం

సాక్షి స్పందన

జి.కొండూరు: గత పది రోజులుగా గ్రామ పంచాయతీ కుళాయిలకు నీటి సరఫరా నిలిచిపోవడంతో వాడుకునేందుకు నీరు లేక నరకయాతన పడుతున్నా మంటూ చెవుటూరు గ్రామంలోని లొద్ది ప్రాంతంలో మహిళలు బుధవారం రోడ్డెక్కి నిరసన తెలిపారు. ఈ ఘటనపై 'నీటి కోసం రోడ్డెక్కిన మహిళలు' శీర్షికన సాక్షి గురువారం కథనాన్ని ప్రచురించింది. స్పందించిన అధికారులు స్థానికంగా గ్రామ పంచాయతీ బోరుబావిలో ఉన్న విద్యుత్ మోటారుకు మరమ్మతులు చేసి గురువారం నీటిని విడుదల చేశారు. లొద్ది ప్రాంతానికి నీటి సరఫరా కావడంతో స్థానిక మహిళలు హర్షం వ్యక్తం చేశారు.

పోస్టర్ల ఆవిష్కరణ

వేమిరెడ్డిపల్లి(విస్సన్నపేట): మూఢ నమ్మకాలకు వ్యతిరేకంగా పనిచేస్తూ శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించేందుకు కృషి చేస్తున్న జన విజ్ఞాన వేదికలో సభ్యులుగా చేరాలని వేమిరెడ్డిపల్లి జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం పి. రవికుమార్ అన్నారు. జన విజ్ఞాన వేదిక సభ్యత్వాల నమోదులో భాగంగా గురువారం వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. జేవీవీ మండల అధ్యక్షుడు ఎంజీ నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి కె. రామారావు, యూటీఎఫ్ జిల్లా కార్యవర్గ సభ్యుడు పులగం రామకృష్ణారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దివ్యాంగురాలికి ట్రిపుల్ ఐటీలో సీటు

నూజివీడు: మూడడుగుల దివ్యాంగురాలు గిన్నెపల్లి ఉమామహేశ్వరికి నూజివీడు ట్రిపుల్ ఐటీలో సీటు లభించింది. ఎన్టీఆర్ జిల్లా వత్సవాయి మండలం వేములనర్వకు చెందిన ఆమె పదో తరగతిలో 510 మార్కులు సాధించింది. గురువారం నిర్వహించిన కౌన్సెలింగ్‌లో ఆమెకు దివ్యాంగుల కోటాలో ట్రిపుల్ ఐటీలో సీటు లభించింది. తల్లిదండ్రులు రేణుక, బాలకృష్ణ కూలిపనులు చేసుకుని జీవనం సాగిస్తారు.

ఊరటనిచ్చిన వర్షం

చాట్రాయి: మండలంలో ఎండిపోతున్న పైర్లకు గురువారం సాయంత్రం కురిసిన భారీ వర్షం ఊరటనిచ్చింది. గత పది రోజుల నుంచి వర్షాలు కురవకపోవడంతోపాటు ఎండలు అధికంగా ఉండటంతో వరి పొలాలు నెర్రెలిచ్చాయి. వరి నార్లు మెట్ట పైర్లు సైతం ఎండిపోయే పరిస్థితి నెలకొంది. ప్రస్తుతం వర్షం కురవడంతో నాట్లు వేసిన రైతులు ఊపిరి పీల్చుకున్నారు.

నూజివీడు ఏఎంసీ చైర్మన్‌గా కుంపటి అరుణ

నూజివీడు: నూజివీడు మార్కెట్ కమిటీ చైర్మన్ (ఏఎంసీ)గా గొల్లపల్లికి చెందిన కుంపటి అరుణను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈమె భర్త కుంపటి రంగారావు పట్టణంలోని ప్రైవేటు జూనియర్ కళాశాలలో లెక్చరర్‌గా పనిచేస్తున్నారు. గత ఆరేళ్లుగా భార్యాభర్తలిద్దరూ బీజేపీ క్రియాశీలక కార్యకర్తలుగా కొనసాగుతున్నారు. గొల్లపల్లి మాజీ సర్పంచ్ గోగినేని శ్రీనివాసకుమార్ అప్పారావుకు ప్రధాన అనుచరులుగా కొనసాగుతున్నారు. అరుణ నియామకంపై బీజేపీ శ్రేణులు హర్షం వ్యక్తంచేస్తున్నాయి.

మంత్రికి షాక్

నూజివీడు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవికి ఆగిరిపల్లి మండలం ఈదులగూడెంకు చెందిన మహిళ పేరును మంత్రి కొలుసు పార్థసారధి సిఫార్సు చేశారు. దానిని ప్రభుత్వం ఓకే చేయకుండా ఏఎంసీ పదవిని బీజేపీకి కేటాయించడంతో మంత్రితో పాటు టీడీపీ వర్గాలు షాక్‌కు గురైనట్లు రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తిరువూరు: తిరువూరు పట్టణంలో 11 కేవీ విద్యుత్ లైన్ల నిర్వహణ పనుల కారణంగా శుక్రవారం ఉదయం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ ఏఈ కృష్ణారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. తంగిళ్లబీడు, సాయిరాఘవ ఎస్టేట్స్, సిద్దార్థస్కూల్ రోడ్డు, బెస్తబజారు, శ్యామవేది ప్రాంతం, రాజుపేట, అప్పనాలపేట, ముస్లింబజార్, పాత ఏడీబీ సెంటర్ నుంచి మెయిన్‌రోడ్డు అష్టలక్ష్మి గుడి వరకు, సీతామహాలక్ష్మి కాలనీ, అశోక్‌నగర్, కూరగాయల మార్కెట్ ఏరియా, ఆర్టీసీ బస్టాండ్ పరిసరాల్లో ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని చెప్పారు.

పీఏసీఎస్ త్రిసభ్య కమిటీ బాధ్యతల స్వీకరణ

నూజివీడు: పోతిరెడ్డిపల్లి పీఏసీఎస్ త్రిసభ్య కమిటీ సభ్యులు గురువారం బాధ్యతలు చేపట్టారు. చైర్మన్‌గా అక్కినేని బెనర్జీ, సభ్యులుగా మందపాటి తిరుపతయ్య, జుజ్జువరపు రాణి నియమితులయ్యారు. ఈ సందర్భంగా చైర్మన్ బెనర్జీ మాట్లాడుతూ రైతులకు ఉత్తమ సేవలు అందిస్తామన్నారు. వ్యవసాయ రుణాలను అందించడమే కాకుండా తీసుకున్న రుణాలను గడువు దాటకుండా వసూలు చేస్తామని చెప్పారు. పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు కొమ్మన నాగేశ్వరరావు, మాజీ సర్పంచ్ అక్కినేని చంద్రశేఖర్, పీఏసీఎస్ ఉద్యోగుల సంఘం నాయకులు అక్కినేని ఆంజనేయ ప్రసాద్, సంఘ కార్యదర్శి ఎ. ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్ సీపీ కార్యకర్తల సమావేశం

జి.కొండూరు: బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ కార్యక్రమంపై మండల స్థాయిలో కార్యకర్తల సమావేశం శుక్రవారం సాయంత్రం నాలుగు గంటలకు జి.కొండూరులో జరుగుతుందని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు జడ రాంబాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి జోగి రమేష్ హాజరవుతారన్నారు. పార్టీ శ్రేణులు తప్పక హాజరు కావాలని కోరారు.

రసాభాసగా కొండపల్లి మున్సిపల్ కౌన్సిల్ సమావేశం



మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ గుంజా శ్రీనివాస్, దయా

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లి మున్సిపల్ కౌన్సిల్ సమావేశం రసాభాసగా కొనసాగింది. మున్సిపల్ చైర్మన్ చెన్నుబోయిన చిట్టిబాబు అధ్యక్షతన గురువారం జరిగిన సమావేశంలో అజెండాలో పెట్టిన అంశాలను చదివి వినిపించారు. టేబుల్ అజెండాగా రూ.5.57 కోట్ల పనులు తీర్మానం చేసేందుకు అప్పటికప్పుడే సభ్యులకు అందజేశారు. వీటిలో సుమారు రూ.38 లక్షల పనులు ఇప్పటికే పూర్తి చేశారు. ఏకపక్షంగా పనులు పూర్తి చేసి తీర్మానం కోరడంపై వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు గుంజా శ్రీనివాస్, మొగిలి దయాసాగర్, ఎం.చంద్రశేఖర్, నల్లమోతు లక్ష్మీ ప్రశ్నించారు. అజెండాలో పొందుపరిచిన అంశాలపై మాత్రమే చర్చించాలని పట్టుబట్టారు. టేబుల్ అజెండాగా అందజేసిన అజెండాలో రూ.5.57 కోట్లు పనులు ఆమోదించేది లేదని భీష్మించారు. పారిశుద్ధ్యం కూడా అధ్వానంగా ఉందని, శానిటరీ ఇన్‌స్పెక్టర్‌ను తక్షణం నియమించాలని సూచించారు. ఈ దశలో వైస్ చైర్మన్లు చుట్టుకుదురు శ్రీనివాస్, కరిమికొండ శ్రీలక్ష్మీ కల్పించుకోవడంతో ఇరువర్గాల మధ్య కొద్దిసేపు వాగ్వివాదం జరిగింది. ఆ సమయంలో ఓటింగ్ పెట్టాలని వైస్ చైర్మన్లు సూచించారు. సమావేశం ముగించవద్దని వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు కోరుతున్న సమయంలో అజెండాలోని అంశాలను ఆమోదించినట్లు టీడీపీ సభ్యులు చేతులెత్తారు. చైర్మన్ సీహెచ్ చిట్టిబాబు సమావేశం ముగిసినట్లు అర్ధంతరంగా ప్రకటించారు. సమావేశం అనంతరం వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు టేబుల్ అజెండాలో పొందుపర్చిన రూ.5.57 కోట్ల పనులపై మరోమారు సమావేశం నిర్వహించాలని చైర్మన్ చిట్టిబాబు, కమిషనర్ రమ్యకీర్తనకు వినతిపత్రం అందజేశారు. చైర్మన్ దంపతులను పలువురు నాయకులు సత్కరించారు. మున్సిపల్ కమిషనర్ రమ్యకీర్తన, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ర్యాలీలో రెడ్‌బుక్ ప్రచారం

కౌన్సిల్ సమావేశానికి ముందు ఇబ్రహీంపట్నం రింగ్ సెంటర్ నుంచి ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో ఎమ్మెల్యే వసంత వెంకటకృష్ణప్రసాద్ కొద్దిసేపు పాల్గొని అనంతరం వెళ్లిపోయారు. రాష్ట్ర వ్యాప్తంగా అమలు జరుగుతున్న రెడ్ బుక్ రాజ్యాంగానికి కొనసాగింపుగా రెడ్ బుక్‌ను ప్రదర్శించారు. ఒకరి తర్వాత ఒకరు బుక్‌ను చేతులతో పట్టుకుని పైకెత్తి ఫొటోలకు ఫోజులిచ్చారు. జాతీయ రహదారిపై నడిరోడ్డుపై ఈ దృశ్యాలను చూసి ప్రజలు ఆశ్చర్యం వ్యక్తం చేశారు.

అంగన్‌వాడీ సిబ్బంది సమస్యలను పరిష్కరించాలి

నూజివీడు: పట్టణంలోని సుందరయ్య భవన్‌లో నూజివీడు ఐసీడీఎస్ ప్రాజెక్టు స్థాయి అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ మహాసభ గురువారం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా పాల్గొన్న ఏలూరు జిల్లా అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షురాలు విజయలక్ష్మి, జిల్లా నాయకురాలు మాణిక్యం మాట్లాడుతూ అంగన్‌వాడీ వర్కర్లకు తీవ్ర ప్రతిబంధకంగా నిలిచిన యాప్స్‌ను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. యాప్‌లో అప్‌లోడింగ్‌తో మరింత పని భారం పెరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. కనీస వేతనాలు అమలు చేయాలన్నారు. మినీ అంగన్‌వాడీ కేంద్రాల్లో ఉన్న ఇబ్బందులను తొలగించి సమస్యలను సత్వరమే పరిష్కరించాలన్నారు. ప్రభుత్వం చొరవ చూపి సమస్యలు పరిష్కరించకపోతే రాష్ట్ర వ్యాప్త ఆందోళనకు సిద్ధమవుతామని హెచ్చరించారు. మహాసభల సందర్భంగా 21 మంది కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ నూజివీడు ప్రాజెక్టు ప్రధాన కార్యదర్శిగా పి రాజకుమారి, అధ్యక్షురాలిగా వై. ఆదిలక్ష్మి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

సోషల్ మీడియాపై అప్రమత్తంగా ఉండాలి

ఆగిరిపల్లి: మొబైల్ ఫోన్లు, సోషల్ మీడియాను విద్యార్థులు అవసరం మేరకే వినియోగించుకోవాలని ఎస్ఐ శుభశేఖర్ అన్నారు. ఆగిరిపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్లో విద్యార్థులకు సోషల్ మీడియా, సైబర్ క్రైమ్, మాదక ద్రవ్యాలు, మైనర్ బాలికల చట్టాలపై గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలలపై జరుగుతున్న లైంగిక వేధింపులు, బాల్య వివాహాలు, అక్రమ రవాణా నేరాలను అరికట్టడం అందరి బాధ్యత అని అన్నారు. విద్యార్థులు ఫోన్లను అవసరం ఉన్న మేరకే వినియోగించుకోవాలని చెప్పారు. ఆపద సమయంలో 112కు సమాచారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయిని లక్ష్మి, ఉపాధ్యాయులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

అధిక ధరకు గ్యాస్ అమ్మకాలపై విచారణ



తిరువూరు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులను విచారణ చేస్తున్న ఆర్డీఓ మాధురి

తిరువూరు: స్థానిక ఇండేన్ గ్యాస్ ఏజెన్సీలో వంట గ్యాస్ సిలిండర్లకు అధిక ధరలు వసూలు చేస్తున్నారని వచ్చిన ఫిర్యాదులపై తిరువూరు రెవెన్యూ డివిజినల్ అధికారి కె. మాధురి గురువారం విచారణ నిర్వహించారు. ఒక్కొక్క సిలిండర్‌కు రూ.60 నుంచి రూ.100 వరకు అధికంగా వసూలు చేస్తున్నారని, ఈ విషయమై ఏజెన్సీలో ఫిర్యాదు చేసినా డోర్ డెలివరీకి అధిక ధర చెల్లించాల్సిందేనని యాజమాన్యం చెప్పడంతో ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన ఐవీఆర్ఎస్ సర్వేలో అధిక శాతం వినియోగదారులు ఈ విషయమై ఫిర్యాదులు చేశారు. జిల్లా కలెక్టర్ ఆదేశాలతో ఆర్డీఓ గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులను విచారణ చేశారు. అనంతరం ఏజెన్సీ గోదాములో సిలిండర్ల నిల్వలను తనిఖీ చేశారు. పీడీఎస్ డీటీ శ్వేత పాల్గొన్నారు.

ఎరువుల దుకాణంలో ఆర్డీఓ తనిఖీ

చింతలపాడు(తిరువూరురూరల్): చింతలపాడులోని ఎరువుల దుకాణాన్ని తిరువూరు ఆర్డీఓ కె. మాధురి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు రసాయనిక ఎరువుల కంటే సేంద్రియ ఎరువుల వినియోగాన్ని ప్రోత్సహించాలని, అనవసరంగా రైతులకు అధిక మోతాదులో ఎరువులు విక్రయించి నష్టపరచవద్దని ఆర్డీఓ ఆదేశించారు. ఎరువుల ధరలు అందరికీ కనిపించే విధంగా బోర్డులో రాయాలని, స్టాకు వివరాలు కూడా తెలియజేయాలని, ప్రతి కొనుగోలుకు రశీదు ఇవ్వాలని చెప్పారు. వ్యవసాయాధికారి పద్మ పాల్గొన్నారు.

శాస్త్రీయ పరిశోధనలకు వర్క్‌షాపులు దోహదం

మైలవరం: విద్యార్థుల శాస్త్రీయ పరిశోధనలకు వర్క్‌షాపులు ఎంతగానో దోహదం చేస్తాయని ప్రిన్సిపాల్ డాక్టర్ కె. అప్పారావు అన్నారు. మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో కెమిస్ట్రీ డివిజన్ విభాగం ఆధ్వర్యంలో వివిధ కళాశాలల అధ్యాపకులు, రీసెర్చ్ స్కాలర్స్, విద్యార్థులకు రెండు రోజుల వర్క్‌షాపు బుధ, గురువారాల్లో నిర్వహించారు. ముఖ్య రిసోర్స్ పర్సన్స్‌గా అధ్యాపకులు డాక్టర్ బీరయ్య బైరి, ఐఐటీ మద్రాస్ ప్రొఫెసర్ రాజేష్ ఖన్నా, ఎన్ఐటీ వరంగల్ అసిస్టెంట్ ప్రొఫెసర్ థామస్ కె. రాజు, అసోసియేట్ ప్రొఫెసర్ ఆంధ్ర లయోలా కాలేజీ వ్యవహరించారు. కళాశాల కెమిస్ట్రీ అధ్యాపకులు డాక్టర్ డి. మల్లికార్జునరావు, డాక్టర్ రాజేష్‌బాబు, శ్యామల, డాక్టర్ కె.కుమారరాజా వర్క్‌షాపు ప్రాక్టీస్ తరగతులు నిర్వహించారు.

వల్లీదేవసేన అమ్మవార్లకు ఆషాఢ సారె

ముసునూరు: గోపవరం శివారు నాగేంద్రపురంలో కొలువై ఉన్న వల్లీదేవసేన అమ్మవార్లకు గ్రామ భక్తులు ఆషాఢ మాస బోనాల సారె సమర్పించారు. గోపవరంనకు చెందిన 200 మంది మహిళా భక్తులు గురువారం గ్రామంలోని వల్లీ, దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి ఆలయానికి తరలివెళ్లి అమ్మవార్లకు ఆషాఢ మాస బోనాల చీరె, సారె పసుపు కుంకుమలు సమర్పించారు. ఆలయ ప్రధానార్చకులు చిట్టిబాబు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులు గ్రామంలోని అన్ని ఆలయాల్లో ఉన్న అమ్మవార్లకు సారె సమర్పించారు.

కొనసాగుతున్న ఇంజినీరింగ్ కార్మికుల సమ్మె

నూజివీడు: మున్సిపల్ ఇంజినీరింగ్ విభాగంలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు గత ఏడేళ్ల నుంచి ఒక్క రూపాయి కూడా వేతనం పెరగకపోవడం దారుణమని సీఐటీయూ పట్టణ కార్యదర్శి జి. రాజు అన్నారు. తమ సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు చేస్తున్న సమ్మె గురువారానికి నాలుగో రోజుకు చేరింది. కార్మికులు పురపాలక సంఘ కార్యాలయం వద్ద నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. రాజు మాట్లాడుతూ పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కార్మికులకు వేతనాలు పెంచాలన్నారు. వేతనాలు పెంచకుండా చాకిరీ చేయించుకోవడం, శ్రమదోపిడీ చేయడం దుర్మార్గమన్నారు. కార్మికుల కుటుంబాలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్నాయని, వారిని ఆదుకోవాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదేనన్నారు. రాష్ట్ర ప్రభుత్వ జీఓ నంబర్ 36 ప్రకారం ఇంజినీరింగ్ కార్మికుల వేతనాలు వెంటనే పెంచాలని, కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, అప్పటి వరకు కార్మికులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను వర్తింపజేయాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్‌ను కార్మికులకు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీఐటీయూ పట్టణ అధ్యక్షుడు ఎస్ఆర్ హనుమాన్లు, మున్సిపల్ యూనియన్ నాయకులు రంగారావు, రామారావు, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిగత ప్రయోజనాల కోసమే ఢిల్లీ చుట్టూ చంద్రబాబు ప్రదక్షిణలు

సీపీఐ ఎంఎల్ లిబరేషన్ నేత హరినాథ్ విమర్శ

నూజివీడు: రాష్ట్ర ప్రజల ప్రయోజనాల కంటే వ్యక్తిగత ప్రయోజనాలను నెరవేర్చుకునేందుకే ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేష్ ఢిల్లీ చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారని సీపీఐ ఎంఎల్ లిబరేషన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డి. హరినాథ్ గురువారం ఒక ప్రకటనలో విమర్శించారు. మోదీ, అమిత్‌షాలకు చంద్రబాబు ఎంత భజన చేసినా రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం నుంచి ఏమీ సాధించలేకపోయారన్నారు. రాష్ట్రంలో కూటమి పాలన ఏడాది పూర్తయిన సందర్భంగా సుపరిపాలన అంటూ కొత్త పల్లవితో ప్రజల వద్దకు వెళ్తుంటే హామీల అమలుపై ప్రజలు నిలదీస్తున్నారని ఎద్దేవా చేశారు. శ్రీకాకుళం నుంచి నెల్లూరు వరకు పేదల భూములను కార్పొరేట్లకు కట్టపెట్టడానికి కూటమి ప్రభుత్వం పనిచేస్తుందే తప్ప ప్రజల కోసం కాదన్నారు. విద్యుత్ చార్జీలు తగ్గించాలని, సూపర్ సిక్స్ హామీలు అమలు చేయాలని, ట్రూఅప్ చార్జీలను రద్దు చేయాలని, స్మార్ట్ మీటర్ల ఏర్పాటును ఉపసంహరించుకోవాలని హరినాథ్ డిమాండ్ చేశారు. చంద్రబాబు మూడు పంటలు పండే వ్యవసాయ భూములను రాజధాని పేరుతో సేకరించడం, నెల్లూరు జిల్లా కరేడులో వ్యవసాయ భూములను బలవంతంగా లాక్కునేందుకు ప్రయత్నాలు చేయడం దారుణమన్నారు.

సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం

ఆగిరిపల్లి: సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమైనదని ఏలూరు జిల్లా సమగ్ర శిక్ష అభియాన్ అసిస్టెంట్ ప్రాజెక్ట్ అధికారి డాక్టర్ కె. పంకజ్ కుమార్ అన్నారు. ప్రధానోపాధ్యాయుల శిక్షణ కార్యక్రమం గురువారంతో ముగిసింది. శిక్షణ పొందిన ప్రధానోపాధ్యాయులు హీల్ సంస్థ సీఈఓ కూరపాటి అజయ్ కుమార్, ప్రధాన కార్యదర్శి తాతినేని పద్మావతికి రూ.1,14,700ను విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో ఎంఈఓ కొవ్వలి ఆనంద్ కుమార్, సమగ్ర శిక్ష అకడమిక్ మోనిటరింగ్ ఆఫీసర్ రెడ్డి రామారావు, ఏలూరు జిల్లా ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రైవేట్ స్కూల్ బస్సు డ్రైవర్లకు డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు

చాట్రాయి: మద్యం సేవించి పాఠశాలల వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ రామకృష్ణ హెచ్చరించారు. మండలంలోని పలు ప్రైవేటు పాఠశాలల బస్సు డ్రైవర్లకు గురువారం డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలల బస్సు డ్రైవర్లు మద్యం సేవించి వాహనాలు నడుపుతున్నట్లు సమాచారం రావడంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తనిఖీలు చేశామని చెప్పారు. మద్యం సేవించి వాహనాలు నడపడం ప్రమాదకరమని, మద్యం సేవించి స్కూల్ బస్సులు నడిపితే తీవ్ర చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

పాలశీతల కేంద్ర మేనేజర్‌కు వీడ్కోలు

లక్ష్మీపురం(తిరువూరురూరల్): తిరువూరు మండలం లక్ష్మీపురం పాలశీతల కేంద్రం మేనేజరుగా పనిచేస్తూ బుద్ధవరం ఫీడ్‌మిక్సింగ్ ప్లాంట్‌కు బదిలీ అయిన టి. సాంబశివరావును గురువారం సాయంత్రం రైతులు, సిబ్బంది సన్మానించారు. జిల్లా యూనియన్ పాలకవర్గ సభ్యులు బొట్టు రామచంద్రరావు, వాణిశ్రీల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సాంబశివరావు పాల ఉత్పత్తి అభివృద్ధికి, రైతుల సంక్షేమానికి చేసిన కృషిని పలువురు అభినందించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

నూజివీడు: పట్టణంలోని ఫైర్‌స్టేషన్‌కు సమీపంలో ఈనెల 16న జరిగిన రెండు బైక్‌లు ఢీ కొన్న ప్రమాదంలో తీవ్ర గాయాలైన మెలిక సూరజ్ (30) ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. ఈ ప్రమాదంలో సాకిరి రాజేష్‌బాబు అక్కడికక్కడే మృతిచెందగా, తీవ్ర గాయాలైన సూరజ్‌ను పట్టణంలోని ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం విజయవాడకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సూరజ్ మృతిచెందాడు. మృతుడికి భార్య, ఐదేళ్ల కుమారుడు, ఆరు నెలల కుమార్తె ఉన్నారు. సూరజ్ అత్తగారిల్లు గుంటూరు జిల్లా పొన్నెకల్లు నుంచి రెండు నెలల కిందటే సొంతూరైన నూజివీడుకు వచ్చాడు. రోడ్డు ప్రమాదంలో మృతిచెందడంతో కుటుంబం దిక్కులేనిదైంది.

ట్రిపుల్ ఐటీ అధ్యాపకుడికి డాక్టరేట్

నూజివీడు: నూజివీడు ట్రిపుల్ ఐటీలో భౌతికశాస్త్రం అధ్యాపకుడు అచ్చుకోల బ్రహ్మస్వాములు డాక్టరేట్ పొందారు. ఈయన 'అల్యూమినియం నానో మెటీరియల్స్ ఫర్ స్పెక్ట్రోస్కోపిక్ అప్లికేషన్స్' అంశంపై గీతం యూనివర్సిటీ నుంచి పీహెచ్‌డీ పూర్తి చేశారు. అసోసియేట్ ప్రొఫెసర్ పి. గోపాలకృష్ణ పర్యవేక్షణలో బంగారం, వెండి లోహాలకు ప్రత్యామ్నాయంగా అల్యూమినియంను స్పెక్ట్రోస్కోపిక్ స్టడీస్‌లో ఉపయోగించడంపై పరిశోధన చేశారు. బ్రహ్మస్వాములును పలువురు అభినందించారు.

ఎరువుల విక్రయాల్లో నిబంధనలు పాటించాలి

ఇబ్రహీంపట్నం: ఎరువులు, పురుగు మందుల విక్రయాల్లో ప్రభుత్వ నిబంధనలు పాటించాలని మండల వ్యవసాయాధికారి రజని పేర్కొన్నారు. ఇబ్రహీంపట్నం మండల వ్యవసాయాధికారి కార్యాలయంలో ఎరువుల డీలర్లు, పీఏసీఎస్ కార్యదర్శులకు అమ్మకాలపై అవగాహన సదస్సు గురువారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రతి దుకాణంలో ఈ పాస్ ద్వారానే అమ్మకాలు జరగాలన్నారు. తేడా వస్తే క్రమశిక్షణ చర్యలకు బాధ్యులు అవుతారని హెచ్చరించారు. ఎరువుల నిల్వలు, అమ్మకాల గురించి ఎప్పటికప్పుడు అధికారులకు తెలియజేయాలని సూచించారు. నానో యూరియా ఉపయోగాలు వివరించారు. సమావేశంలో ప్రైవేట్ డీలర్స్, సొసైటీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఎరువుల వ్యాపారులతో సమావేశం..

మైలవరం: ఎరువులు, విత్తనాల డీలర్లు తప్పనిసరిగా స్టాకు బోర్డులో అప్‌డేట్ చేయాలని మండల వ్యవసాయాధికారి సంధ్యారాణి అన్నారు. మైలవరం ఆర్ఎస్‌కేలో మండలంలోని ఎరువుల వ్యాపారులతో గురువారం సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ రసాయన ఎరువుల వాడకం 15 శాతం తగ్గించాలని, నానో యూరియా, నానో డీఏపీ వాడకంపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ప్రతి అమ్మకాన్ని ఈ పాస్‌బుక్‌లో తప్పక నమోదు చేయాలని సూచించారు. ఎరువుల కృత్రిమ కొరత సృష్టించి బ్లాక్‌లో ఎరువులు అమ్మిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎరువులు ఎంఆర్‌పీకే విక్రయించాలన్నారు. మదర్ ఎర్త్ పునరుద్ధరణ, అవగాహన, పోషణ, మెరుగుదల కోసం పీఎం ప్రోగ్రామ్‌పై డీలర్స్‌కు అవగాహన కల్పించారు. డీలర్లు, వ్యవసాయ శాఖాధికారులు పాల్గొన్నారు.